# 'మునక్కాయల దొంగ'

మనం చిన్నతనంలో ఏదో ఒక తప్పు కచ్చితంగా చేస్తాం. మధ్యతరగతి ఇళ్లల్లో చిరు దొంగతనాలు అత్యంత సహజం, అబద్ధాలు సరేసరి...

మనం అప్పుడెప్పుడో చేసిన చిన్నచిన్న తప్పిదాలనూ... చిల్లర నేరాలనూ వయసు పైబడ్డ తర్వాత వాటిని గ్లోరిఫై చేస్తూ మన పిల్లలకు చెప్పడం అత్యంత సహజం...

ముప్ఫై ఏళ్ల క్రితం మా ఇంటి దొడ్లో బాగా ఏపుగా పెరిగిన మూడు మునగ చెట్లుండేవి. అవి కాపుకాస్తే చెట్టునిండా కాయ కనిపించేది. ఒక్కోచెట్టూ కనీసం అయిదు వందల కాయలిచ్చేది. ఇంటి వాడకానికి పోనూ మిగిలిన కాయల్ని చెట్టు మీదే అమ్మేసేది మా అమ్మ. వాటిని తీసుకెళ్లేందుకు ఓ సాయిబు వచ్చేవాడు. సైకిలు, ఓ గోనెసంచి హ్యాండిలు మీదునించీ పొడుగ్గా ఓ వెదురుబొంగుతో వచ్చేవాడు. (దాన్ని 'దోటీ' అనేవాడు) వందకాయలకి ఆరు రూపాయలు యిచ్చేవాడు. (ఇప్పుడు నాలుక్కాయలు అయిదు రూపాయలు) ఆ సాయిబు ఏ కారణంగానో రాకపోతే నా స్నేహితుడు సామ్యేలుకి పండగే. వాడు పెద్ద తిండిపోతు. ఆ సుగుణానికి తోడు విపరీతమైన సినిమాల పిచ్చి. మా అమ్మ మా స్నేహితులందరికీ అమ్మే. సామ్యేలుగాడు ఎప్పుడు ఆకలైతే అప్పుడు ఇంటికొచ్చేస్తాడు. 'అమ్మా ఆకలేస్తోంది' అని. అయితే మా తండ్రిగారికి అస్సలు సరిపోయేది కాదు. (ఆయన వేణుగోపాలస్వామి ఆలయంలో అర్చకులు. వీణ్ణి కులం కారణంగా ద్వేషించేవాడాయన. ఆ విషయంలో అమ్మ ఆయన్తో గొడవ పెట్టుకునేది. నాకూ నా తండ్రికీ కూడా చాలాసార్లు గొడవ జరిగేది. మా అమ్మ కాలంచేసి తర్వాత నా అబ్రాహ్మణ్యాన్ని భరించలేక నా తండ్రి ఆయనలాగే పౌరోహిత్యం చేసుకునే ఆయన మనవడి దగ్గరికెళ్లిపోయాడు. ఆయన చనిపోయే వరకూ అస్పృశ్యత నిఖార్సుగా పాటించాడు. మా అమ్మ సామ్యేలుగాడికి సపోర్ట్. వాళ్లసలు కోమట్లు. వాళ్ల తాతగారు మతం పుచ్చుకున్నారు అని వాదించేది.)

సర్లెండి మన గొడవ మునక్కాయలూ సామ్యూలుగాడూ కదూ...

సామ్యేలుగాడికి సినిమాల పిచ్చి... కదూ.. మ్యాట్నీకో మరో ఆటకో డబ్బు కావల్సి వస్తే ఇంటికొచ్చి "అమ్మా! మునక్కాయలు కొట్టి మార్కెట్‌కు వేసొస్తా" అనేవాడు. మనమే తీసుకెళ్లి మార్కెట్టులో అమ్మితే వందకు ఏడు రూపాయలిస్తారు. ఇంటి దగ్గరకన్నా ఒక్క

రూపాయెక్కువ. సామ్యేలుగాడు ఓపిగ్గా మూడు చెట్ల కాయలూ కొట్టేవాడు. అన్నీ గోనెలో కట్టి సైకిలు క్యారియర్కి కట్టుకొని వెళ్లేవాడు. ఇక్కడే వాడు దొంగతనం చేసేది. కాయలు ఎంచి ఓ ఏభై కాయలు తక్కువ లెక్క చెప్పేవాడు అమ్మకి. ఆ ఏభైకాయలకు మూడున్నర రూపాయలూ, దాంతో వాడు మా పొట్టి వేణు బావగాడూ ఏ మ్యాటినీకో మొదటాటకో చెక్కేసేవాళ్లు. అట్లా నిరాటకంగా అమ్మను ఓ అయిదేళ్లు మోసం చేసాడు సామ్యేలు. (అలా అని అనుకునేవాడు) ఇప్పటికీ తన పిల్లలకీ స్నేహితుల పిల్లలకీ ఆ విషయాన్ని గొప్పగా చెబుతూంటాడు. ఇప్పుడు నంద్యాలలో వున్నాడు. మొన్న తన కూతురు ఎమ్మెస్సీ సీటు గురించి మాట్లాడ్డానికి కర్నూలు వచ్చాడు. వచ్చీరాంగానే మునక్కాయల విషయం గుర్తుచేసుకున్నాడు. ఇప్పుడు దొడ్లో మునగచెట్లు లేవు. ఒక్క మామిడి చెట్టూ సీమచింత చెట్టు మాత్రం మిగిలున్నాయి. బోసిబోయిన దొడ్డిని దిగులుగా చూసాడు వాడు.

"అప్పుడు అమ్మను మోసం చేస్తున్నానన్న విషయం ఎంతమాత్రమూ బాధ కలిగించేది కాదు మామా. ఆ మహాతల్లి చేతి తిండితిని చిల్లర కోసం మోసం చేసేవాణ్ణి" అని లోపలకెళ్లి. మా జయక్కతోటి "అక్కా! అమ్మ చేసినట్టు చప్పిడి పప్పు, మజ్జిగ పులుసూ నువ్వు మాత్రమే చేయగలవు, చేసిపెట్టు. మళ్లీ కర్నూలు ఎప్పుడొస్తానో ఏమో" అని అమ్మ ఫొటో ఎదురుగా నిలబడి "అమ్మా ఇదుగో ఇప్పుడు చెప్తున్నా అప్పట్లో మునక్కాయలో లెక్క తప్పు చెప్పి డబ్బు దొంగిలిచేవాణ్ణి. ఇప్పుడు క్షమించేయ్" అని గట్టిగా నవ్వాడు.

అమ్మకు వాడి దొంగతనం గురించి తెలుసనే వాస్తవం వాడికీ రోజుకీ తెలియదు. అమ్మ ఫొటో చూస్తుంటే మనస్సంతా తడి... ●